

కడప, చిత్తూరు జట్ల ఘన విజయం

ఏసీఏ అండర్-16 మల్టీ డే మ్యాచ్‌లో కడప, చిత్తూరు జట్లు ఘన విజయం సాధించాయి. చిత్తూరు ఆటగాడు మహ్మద్ షారుఖ్ అక్తర్ సెంచరీ చేశాడు. -8లో



'ఆడబిడ్డ నిధి' ఇవ్వకుండానే రాష్ట్రాన్ని అమ్మేస్తున్నారు

'ఆడబిడ్డ నిధి' పథకం అమలు చేయకుండానే రాష్ట్రాన్ని అమ్మేస్తున్నారని మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా విమర్శించారు. -8లో

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 30.0/24.5

జిల్లాలో బుధవారం 24.5 - 30.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 3.2 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

జిల్లాలో కొనసాగుతున్న వర్షాలు

కడప అగ్రికల్చర్: అల్పపీడనం కారణంగా జిల్లాలో వర్షాలు కొనసాగుతున్నాయి. మంగళవారం ముద్దనూరులో 26.4 మి.మీ వర్షపాతం నమోదైయింది. కొండాపురంలో 15.2, కమలాపురంలో 12.4, సింహాద్రిపురంలో 10.6, తొండూరులో 3.2, లింగాల, సీకేదిన్నె 2.2, బి.మఠం, పులివెందులలో 1 మి.మీ వర్షం కురిసింది.

షోలాపూర్-తిరుపతి రైలు ధర్మవరం వరకు పొడిగింపు

కడప కోటిరెడ్డిసర్కిల్: తిరుపతి-షోలాపూర్-తిరుపతి (01437/01438) రైలును ధర్మవరం వరకు పొడిగించారని కడప రైల్వే కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ తెలిపారు. ఈ రైలును సెప్టెంబరు 27 వరకు రానుపోను 20 ట్రిప్పులు నడపనున్నారని తెలిపారు. ఈ రైలు గురువారం రాత్రి 11.20 గంటలకు షోలాపూర్‌లో బయలుదేరి కురుద్వాడి, బార్సి టౌన్, లాతూర్, లాతూర్‌రోడ్డు, బీదర్, కలబురిగి, వాడి, యాదగిరి, క్రిష్ణ, రాయచూర్, మంత్రాలయం రోడ్డు, ఆదోని, గుంతకల్లు, గుత్తి, తాడిపత్రి, ఎర్రగుంట్లమీదుగా మరుసటిరోజు కడపకు రాత్రి 7.53 గంటలకు చేరుకుంటుందన్నారు. ఇక్కడినుంచి రాజంపేట, రేణిగుంట మీదుగా తిరుపతికి, పాకాల, పీలేరు, కలికిరి, మదనపల్లెరోడ్డు, ములకలచెరువు, కదిరి మీదుగా ధర్మవరం శనివారం ఉదయం 3.30 గంటలకు చేరుకుంటుందన్నారు. అదేరోజు ఉదయం 5.30 గంటలకు ధర్మవరంలో బయలుదేరి ఇదే మార్గంలో మధ్యాహ్నం 1.30 గంటలకు కడపకు చేరుకుని ఆదివారం ఉదయం 10.45 గంటలకు షోలాపూర్ చేరుతుందని ఆయన వివరించారు.

ఎరువుల కొరత సృష్టిస్తే లైసెన్స్ రద్దు



మహాలక్ష్మి ఫర్టిలైజర్స్ దుకాణంలో ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న జేడీఏ చంద్రనాయక్

ప్రొద్దుటూరు రూరల్: ఎరువుల కృత్రిమ కొరతను సృష్టిస్తే ఎరువుల దుకాణాల లైసెన్స్‌ను రద్దు చేస్తామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి చంద్రానాయక్ హెచ్చరించారు. స్థానిక మైదుకూరు రోడ్డులోని మహాలక్ష్మి ఫర్టిలైజర్స్ ఎరువుల దుకాణాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దుకాణంలోని ఎరువుల నిల్వలను, రికార్డులను పరిశీలించారు. నిల్వలలో తేడా వస్తే సరుకులను సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు. కొనుగోలు బిల్లులను కచ్చితంగా ఇవ్వాలని తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడా ఎరువుల కొరత లేదన్నారు. ఖరీఫ్ సీజన్‌కు గాను 70వేల మెట్రిక్ టన్నుల ఎరువులు జిల్లాకు మంజూరయ్యాయన్నారు. ఈ సీజన్‌లో మూడు దశల వారీగా ఎరువుల సరఫరా జరుగుతుందన్నారు. తొలి దశలో 25వేల మెట్రిక్ టన్నుల ఎరువులు వచ్చాయన్నారు. ఏడీఏలు అనిత, అశోక్, ఏఓ వరహరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

గండిలో హుండీల ఆదాయం లెక్కింపు



గండి ఆలయంలో హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న అధికారులు, సిబ్బంది


చక్రాయపేట: గండి వీరాంజనేయస్వామి సన్నిధిలో ఉన్న హుండీల ఆదాయాన్ని లెక్కించినట్లు ఆలయ సహాయకమిషనర్ వెంకట సుబ్బయ్య తెలిపారు. ఏడు శాశ్వత హుండీల ద్వారా ఆలయానికి రూ.6,55,549లు, అన్నదానం హుండీ ద్వారా రూ. 7,453లు వెరసి మొత్తం రూ.6,63,002లు వచ్చిందన్నారు. దీంతో పాటు కొన్ని గ్రాముల మిక్స్‌డ్ బంగారు, వెండి వస్తువులు వచ్చినట్లు తెలిపారు. అలాగే 11 కువైట్ దినార్‌లు కూడా వచ్చినట్లు చెప్పారు. కడప దేవదాయ శాఖ సహాయ కమీషనర్ మల్లికార్జున ప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన ఈకార్యక్రమంలో ఆలయ ప్రధాన,ఉప ప్రధాన,అర్చకులు కేసరి,రాజారమేష్,చక్రాయపేట ఏపీజీబీ అధికారులు, ఆలయ సిబ్బంది, సేవకులు పాల్గొన్నారు.

టోల్‌గేట్ టెండరు ద్వారా..

గండి వీరాంజనేయ స్వామి సన్నిధిలో యేడాది కాలం పాటు టోల్‌గేటు వసూలు హక్కు కల్పించుటకు నిర్వహించిన టెండరు ద్వారా ఆలయానికి రూ.16,10,000లు ఆదాయం వచ్చినట్లు ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య తెలిపారు. అశోక్‌రెడ్డి అనే వ్యక్తి ఈ టెండర్ దక్కించు కున్నట్లు ఆయన తెలిపారు.

సుముహూర్తాల శ్రావణం

- ఈనెల 26 నుంచి వరుస ముహూర్తాలు
- పురోహితులు, మంగళ వాయిద్యాలు, డెకరేషన్లకు డిమాండ్
- కరువుతో బంగారు, వస్త్రాల కొనుగోళ్లపై ప్రభావం



కల్యాణ వేదిక

కడప సెవెన్‌రోడ్స్/ రాజంపేట టౌన్: శుభాల శ్రావణమాసం వచ్చేస్తోంది. వస్తూ..వస్తూ సుముహూర్తాలన్నో మోసుకొస్తోంది. ఇప్పటికే గురు మూఢం కారణంగా 48 రోజులుగా శుభ కార్యాలు లేవు. అందుకే శ్రావణమాసంలో ముఖ్యంగా జిల్లాలో పెళ్లి బాజాలు మోగనున్నాయి. వీటితోపాటు భూమి పూజలు, గృహ ప్రవేశాలు, సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించనున్నారు. శ్రావణ పౌర్ణమికి ముందు అంటే ఆగస్టు 8వ తేది వచ్చే వరలక్ష్మి వ్రతం మహిళలకు అత్యంత విశేషమైనది. మాఘం ,వైశాఖం, శ్రావణం, మార్గశిర మాసాలు వివాహాలు, శుభ కార్యాలకు అనుకూలమైనవి.

ఆశల పల్లకిలో..

పెళ్లిళ్ల సీజన్ కావడంతో కల్యాణ మండపాలు కళకళలాడనున్నాయి. ఇప్పటికే జిల్లాలోని కల్యాణ మండపాలన్నీ రిజర్వ్ అయ్యాయి. ఇక పెళ్లిళ్లు, ఇతర శుభ కార్యాలపై ఆధారపడ్డ వస్త్ర దుకాణదారులు, బంగారు వ్యాపారులు, మంగళ వాయిద్య కళాకారులు, వంట వారు, క్యాటరింగ్ సిబ్బంది, హోటళ్ల యజమానులు, పూల వ్యాపారస్తులు, మండపాల డెకరేషన్ నిర్వాహకులు తదితరులు ప్రస్తుత శ్రావణమాసంపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. వివాహ క్రతువులను నిర్వహించడంలో పురోహితులే కీలకం. వీరికి ఈ సీజన్‌లో డిమాండ్ ఉంటుంది. కడప నగరంలో ఈ మాసంలో ఒక్కో పురోహితుడు సగటున ఐదు వివాహాలు జరిపిస్తారు.

సుముహూర్తాలు ఇవే..

శ్రావణమాసం ప్రారంభమైన మరుసటిరోజు నుంచే మంచి ముహూర్తాలు మొదలవుతాయని పండితులు వివరిస్తున్నారు. జూలై 26, 30, 31, ఆగస్టు 1, 3, 5, 6, 7, 8, 9, 10, 12, 13, 14, 17వ తేది వరకు ఉన్నాయి. మళ్లీ సెప్టెంబరు 23, 24, 26, 27, 28 తేదీలు మంచి ముహూర్తాలుగా చెబుతున్నారు. అక్టోబరులో 1, 2, 3, 4, 7, 8, 10, 11, 12, 16, 17, 22, 23, 24, 26, 28, 29, 30, 31, నవంబరులో 1, 2, 4, 7, 12, 13, 14, 15, 22, 23, 25, 26, 27 తేదీల్లో వివాహాది శుభకార్యాలకు మంచి ముహూర్తాలని పేర్కొంటున్నారు.



శ్రావణం శుభప్రదం



ఆషాఢ శుద్ధ తొలి ఏకాదశి నుంచి దక్షిణాయన పుణ్యకాలం ప్రారంభమైంది. ఈనెల 25 నుంచి శ్రావణ మాసం ప్రారంభం కానుండడంతో వివాహాలు, శుభకార్యాలకు అనుకూలంగా ఉంటుంది. సనాతన ధర్మంలో వివాహం ప్రధానమైనది. వీటిని సాంప్రదాయ పద్ధతిలో నిర్వహిస్తే ఆ జంటకు మంగళం జరుగుతుంది. ప్రస్తుతం ఆడంబరాలకు ప్రాధాన్యత పెరిగి ఆచార వ్యవహారాలు తక్కువైపోతున్నాయి. ముందురోజు రాత్రే రిసెప్షన్ ఏర్పాటు వల్ల ముహూర్తానికి హాజరయ్యే వారి సంఖ్య బాగా తగ్గిపోవడం ఆందోళన కలిగించే పరిణామం. ఆర్థిక స్తోమత లేని పేద వారికి వివాహ క్రతువును మేము ఉచితంగా నిర్వహిస్తున్నాం.

– కె.విజయ్‌భట్టర్, అధ్యక్షుడు, జిల్లా అర్చక పురోహిత సమాఖ్య, కడప

అమ్మవారి పూజలకు వేళాయె..

శ్రవణ నక్షత్రం మహావిష్ణువు జన్మనక్షత్రం కావడం వల్ల ఈమాసం విష్ణుపూజలకు ప్రసిద్ధి. శ్రావణమాసంలో వచ్చే మంగళ, శుక్ర, శనివారాలను హిందువులు అత్యంత పుణ్యప్రదమైనవిగా భావిస్తారు. మంగళవారం గౌరి పూజలు, శుక్రవారం లక్ష్మీపూజలు, శనివారం విష్ణు పూజలు చేస్తారు. అలాగే అందుబాటులో ఉండే అమ్మవారి ఆలయాల్లో మహిళలు నిత్యం విశేషంగా పూజలు నిర్వహిస్తారు. ఇదిలావుంటే శ్రావణమాసంలో శుక్రవారానికి ఎంతో ప్రత్యేకత ఉంది. ఈఏడాది శుక్రవారంతోనే శ్రావణమాసం ప్రారంభం కానుండడం విశేషం. ఈ నెలలో చాలా మంది మాంసాహారాలకు దూరంగా ఉంటారు. ఈమాసంలో వచ్చే నాగుల చవితి, వరలక్ష్మీవ్రతం, రాఖీపౌర్ణమి, శ్రీకృష్ణాష్టమి ఇలా ముఖ్యమైన పండుగలు బంధాలు, బాంధవ్యాలను తెలుపుతాయి. సంస్కృతి, సాంప్రదాయాల్లోను ఈమాసానికి ప్రత్యేకత ఉంది.



శ్రీవాసవి కన్యకాపరమేశ్వరిదేవి

ఈ సారి శ్రావణమాసంలో జరగనున్న పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలపై కరువు ప్రభావం తీవ్రంగానే కనబడుతోంది. జిల్లాలో రెండేళ్లుగా కరువు తిష్ట వేసింది. పలు మండలాల్లో వర్షాధారంపై ఆధారపడి సాగు చేసిన పత్తి, మినుము, వేరుశనగ, బుడ్డశనగ వంటి పంటలు నిలువునా ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఎక్కడైనా అరకొరగా పండిన పంటలకు సైతం కనీస మద్దతు ధరలు లభించలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో ప్రకృతి వైపరీత్యాల వల్ల ఏ సీజన్‌లో నష్టపోతే ఆ సీజన్‌లోనే రైతులకు పరిహారం అందించి ఆదుకున్నారు. పీఎం కిసాన్‌తో సంబంధం లేకుండా అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులకు రూ. 20 వేలు చొప్పున అందిస్తామని ఇచ్చిన హామీ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇప్పటికీ అమలు చేయలేదు. పైగా గతేడాది పండించిన పంటలకు ధరలు లేక రైతులు బాగా నష్టపోయారు. జిల్లాలో నెలకొన్న కరువు, వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరలు లేకపోవడంతో ఆడపిల్లల తల్లిదండ్రులకు పిల్లల పెళ్లిళ్లు చేయడం భారంగామారింది.

కరువు ప్రభావం



- మరోవైపు బంగారం ధరలు కొండెక్కి కూర్చొన్నాయి. మంగళవారం కడప మార్కెట్ 24 క్యారెట్ల ఒక గ్రాము బంగారం ధర రూ. 10,129గా ఉంది. అంటే తులం బంగారం ధర రూ. 1,01,290 పలికింది. 22 క్యారెట్ల ఒక గ్రాము బంగారం ధర రూ. 9285 ఉంది. అంటే తులం రూ. 92,850 పలుకుతోంది. వివాహం చేయాలంటే కనీసం 10 తులాల బంగారమైనా కొనుగోలుచేయాల్సి ఉంటుంది. ఈ లెక్కన బంగారు కొనుగోలుకు రూ.10 లక్షలకు పైగా ఖర్చు చేయాల్సి వస్తోంది. ప్రస్తుతం దేవాలయాలు, ఇళ్ల వద్ద పెళ్లిళ్లు నిర్వహించడం లేదు. ప్రతి ఒక్కరూ కల్యాణ మండపాల్లోనే వివాహ క్రతువును నిర్వహిస్తున్నారు. సగటున రూ. లక్ష నుంచి రూ. 3 లక్షల వరకు కల్యాణ మండపానికే కావాల్సి వస్తోంది. ఇక మండపాల డెకరేషన్‌కు కనీసం రూ. లక్షల్లో వెచ్చించాల్సి ఉంటుంది. ఇక వివాహ భోజనాలకు ఎంతలేదన్నా రూ. 5 లక్షలకు పైగా చెల్లించాల్సి వస్తోంది. అలాగే మంగళ వాయిద్యాలు, వస్త్రాలు, పూలు, వీడియో, ఫోటోషూట్‌లు, ఇతర ఖర్చులు వేసుకుంటే సాదాసీదా వివాహానికి సగటున రూ. 20 లక్షలు వరకు అవుతోంది. దీంతో పేద, మధ్యతరగతి వర్గాల వారికి ఆడపిల్లల వివాహాలు చేయడం తలకుమించిన భారంగా మారింది.

ప్రభుత్వ పాఠశాల పరిశీలన

ప్రొద్దుటూరు కల్చరల్: మండలంలోని సీతంపల్లెలో శిథిలావస్థకు చేరిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను డీఈఓ షంషుద్దీన్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులతో డీఈఓ మాట్లాడుతూ విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలకు పంపాలని సూచించారు. దీంతో వారు మాట్లాడుతూ పాఠశాల శిథిలావస్థకు చేరిందని, విద్యార్థులకు సరైన వసతులు లేవని, ఇందువల్ల తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలలో చేర్పించామని వివరించారు. పాఠశాలకు నూతన భవనం ఏర్పాటు చేయిస్తానని, విద్యార్థులను పాఠశాలకు పంపాలని డీఈఓ కోరగా.. పంపిస్తామని సమాధానమిచ్చారు. ఎంఈఓ సావిత్రమ్మ, ఉపాధ్యాయుడు డీవీ రమణారెడ్డి, సీఆర్పీ భాస్కర్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.




విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీఈఓ షంషుద్దీన్

ఉన్నత చదువులకు ఓపెన్ స్కూల్ వరం

పోరుమామిళ్ల: మధ్యలో చదువు మానేసినవారు, 14 సంవత్సరాలు పైబడినవారు ఓపెన్‌స్కూల్ ద్వారా పదవ తరగతి చదివి విద్యాభ్యాసం కొనసాగించవచ్చని జిల్లా విద్యాశాఖ అధికారి షంషుద్దీన్ తెలిపారు. బుధవారం పోరుమామిళ్ల ప్రభుత్వ జూనియర్ కళాశాలో ఓపెన్‌స్కూల్ వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ సాంబశివారెడ్డి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామిరెడ్డి, సర్వశిక్షా అభియాన్ ఏఎంఓ విజయభాస్కర్, పోరుమామిళ్ల, కలసపాడు మండలాల ఎంఈఓలు వెంకటయ్య, మస్తాన్‌వలి, తదితరులు పాల్గొన్నారు.

హంసఫర్‌కు కడపలో స్టాపింగ్ ఇవ్వండి

పులివెందుల : చెన్నై - అహ్మదాబాద్ మధ్య నడిచే హంసఫర్ ఎక్స్‌ప్రెస్‌కు కడపలో స్టాపింగ్ ఇవ్వాలని ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కోరారు. ఈ మేరకు కేంద్ర రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌ను బుధవారం ఢిల్లీలో కలిసి వినతిపత్రమిచ్చారు. దీంతో పాటు పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. కడపలోని రాయచోటి రోడ్డులో ఊటుకూరు, ప్రకృతి నగర్ తదితర ప్రాంతాల వాసుల రాకపోకలకు రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు. ప్రస్తుతం తిరుపతి - షిరిడీ మధ్య వారానికి ఒక రోజు మాత్రమే రైలు నడుస్తోందని, అది కూడా మల్టీ చేంజ్ రూట్లుగా వెళ్లడంవల్ల ప్రయాణ సమయం ఎక్కువవుతోందన్నారు. తిరుపతి నుంచి షిర్డీకి నేరుగా ఒక రైలు ను ప్రతిరోజు నడపాలని, ఏపీ, కర్ణాటక, మహారాష్ట్ర భక్తులకు ఉపయోగకరంగా ఉంటుందని మంత్రికి విన్నవించారు.



కేంద్ర మంత్రికి వినతిపత్రమిస్తున్న ఎంపీ అవినాష్‌రెడ్డి



పెన్నానదికి జలకళ

మండల కేంద్రమైన సిద్దవటంలోని పెన్నానదిలో బుధవారం తెల్లవారు జాము నుంచి వరద నీరు ప్రవహిస్తుండటంతో జలకళ సంతరించుకుంది. వర్షాలు సక్రమంగా కురవక, భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో పెన్నా పరీవాహక ప్రాంతాల రైతులు వ్యవసాయ బోర్లలో నీరు లేక ఇబ్బందులు పడ్డారు. ఇటీవల వర్షాలు కురవడంతో పెన్నాకి వరద నీరు వచ్చి చేరడంతో నదీ ఒడ్డున ఉన్న గ్రామాల్లోని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.

-సిద్దవటం

పారదర్శకంగా పథకాల అమలు



మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప సెవెన్‌రోడ్స్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని రకాల అభివృద్ధి పథకాలు, కార్యక్రమాలను జిల్లాలో పారదర్శకంగా అత్యంత ప్రాధాన్యతతో అమలు చేయాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలులో జిల్లాలో పీ4, సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ తదితర కార్యక్రమాల అమలు నిర్వహణపై కలెక్టర్ జేసీ అదితిసింగ్, డీఆర్వో విశ్వేశ్వర నాయుడులతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎంఎస్‌ఎంఈలను ఆర్థికంగా బలోపేతం చేసి పారిశ్రామికంగా జిల్లాను అభివృద్ధి చేయడం కోసం రాంప్ కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేసేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. రాష్ట్రంలో పేదరికాన్ని సమూలంగా నిర్మూలించే లక్ష్యంలో భాగంగా జిల్లాలో ఇప్పటికే బంగారు కుటుంబాలను ప్రాథమికంగా సర్వే, గ్రామసభలు ద్వారా గుర్తించామని పేర్కొన్నారు. సూక్ష్మ, చిన్న మధ్య తరహా ఎంటర్ ప్రెన్యూర్లను సాంకేతికంగా, ఆర్థికంగా బలోపేతం చేసే దిశగా చర్యలు చేపట్టడం జరుగుతోందన్నారు. ఇందుకోసం ప్రపంచ బ్యాంక్ కూడా ప్రభుత్వ రంగానికి ఆర్థిక మద్దతునిస్తోందన్నారు. అందులో భాగంగా జిల్లాలో ఉద్యం వర్క్‌షాప్‌లను నిర్వహించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను చేపట్టాలని ఆదేశించారు. పీ4 ఫౌండేషన్ అమలులో భాగంగా ముఖ్యమంత్రి సూచనల మేరకు జిల్లాలో ఇప్పటికే జిల్లాలో 78 వేల బంగారు కుటుంబాలను గుర్తించడం జరిగిందని, దాదాపు 10 వేల మందిని ఎంపిక చేసిన మార్గదర్శుల ద్వారా అడాప్ట్ చేసుకోవడం జరిగిందన్నారు. ఆగస్టు 10 నాటికి తుది జాబితాలో ఉన్న బంగారు కుటుంబాలను మార్గదర్శకులు దత్తత తీసుకునేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని వివరించారు. సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ ఏర్పాటుకు సంబంధించి జిల్లా కేంద్రంలోని మున్సిపల్ మెయిన్ స్కూలులో పైలెట్ ప్రాజెక్టుగా సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ ను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి మండలంలోను ఇలాంటి ఒకే సెంట్రలైజ్డ్ స్మార్ట్ కిచెన్ ఏర్పాటు చేస్తామని వివరించారు. కేఎంసి కమిషనర్ మనోజ్ రెడ్డి, కడప, జమ్మలమడుగు, పులివెందుల, బద్వేలు ఆర్డీవోలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చిన్నయ్య, చంద్రమోహన్, సీపీవో హజరతయ్య, డిఆర్డీఏ, డ్వామా పీడీ ఆది శేషారెడ్డి, పరిశ్రమల శాఖ జిఎం చాంద్ బాషా, డీపీఓ ఏవో ఖాదర్ బాషా, సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహిళ అదృశ్యం


షేక్ మస్తాన్‌బీ

కలసపాడు : మండలంలోని ముదిరెడ్డిపల్లె గ్రామానికి చెందిన షేక్ మస్తాన్‌బీ(30) అదృశ్యమైనట్లు ఎస్ఐ తిమోతి బుధవారం తెలిపారు. సోమవారం సాయంత్రం మస్తాన్‌బీ దుకాణానికి వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని ఆమె భర్త హసన్‌వలీ ఫిర్యాదు చేశాడన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9121100632 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు.

ఆత్మహత్యకు యత్నించిన మహిళ మృతి

కడప అర్బన్ : కడప చిన్న చౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓం శాంతి నగర్‌లో ఈనెల 17వ తేదీన ఉమామహేశ్వరి (52) తన ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తన కుమారుడు సాయి ప్రతాప్ రెడ్డి సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేసేవాడు. అప్పులు చేసి ఇబ్బంది పడిన అతని వ్యవహార శైలి మార్చుకోక పోవడంతో తల్లి తీవ్ర ఆవేదనకు గురైంది. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వెంటనే బంధువులు కర్నూలుకు తరలించారు. బుధవారం ఆమె చికిత్స పొందుతూ మృతి చెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చిన్నచౌకు పోలీసులు తెలిపారు.

దొంగతనం కేసు నమోదు

చాపాడు : మండలంలోని టీఓపల్లెకు చెందిన ఎల్.రవిశంకర్‌రెడ్డి అనే వ్యక్తిపై దొంగతనం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపారు. టీఓపల్లెకు చెందిన రవిశంకర్‌రెడ్డి తమ గ్రామంలోని పొలాల్లో నాలుగు విద్యుత్ స్తంభాలను తమ అనుమతి లేకుండా తొలగించుకుని తన అవసరాలకు వాడుకున్నాడని, వీటి విలువ రూ.4వేలు ఉంటుందని విద్యుత్ శాఖ అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

వరకట్న వేధింపులపై..

పులివెందుల రూరల్ : పులివెందుల మండల పరిధిలోని ఎర్రబల్లెకు చెందిన షేక్ రేష్మా అనే మహిళ భర్త, అత్తామామలు వరకట్నం తేవాలని వేధిస్తున్నారని బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. భర్త నవాజ్ షరీఫ్, మామ ఖాజా మొహిద్దీన్, అత్త రహమత్‌బీలు పెళ్లయినప్పటి నుంచి రేష్మాను అదనంగా వరకట్నం తేవాలని వేధిస్తుండటంతో భర్త, అత్తమామలపై కేసు నమోదు చేసినట్లు సీఐ చాంద్ బాషా తెలిపారు.

లైంగికంగా వేధిస్తున్నాడని..

చాపాడు : మండల కేంద్రమైన చాపాడులోని దినకర్ అనే వ్యక్తిపై బుధవారం లైంగిక వేధింపుల కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చిన్న పెద్దయ్య తెలిపారు. స్థానిక దళితవాడకు చెందిన దినకర్ తన ఇంటి సమీపంలోని ఓ ఇంటిలోకి వెళ్లి ఓ మహిళపై లైంగిక వేధింపులకు పాల్పడ్డాడన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

డబ్బులు ఎగ్గొట్టాడని..

పులివెందుల రూరల్ : కర్నూలు జిల్లా బేతంచర్ల గ్రామానికి చెందిన కరీం బాషాపై పులివెందుల పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చాంద్ బాషా తెలిపారు. ఏడాది క్రితం పులివెందుల చీనీ కాయల మార్కెట్‌లో వేలం పాట పాడి సుమారు రూ.30 లక్షలు ఇవ్వకుండా వెళ్లిపోవడంతో చీనీ వ్యాపారులు సూరారెడ్డి, సాదిక్ బాషా, హనుమంతురెడ్డిల తోపాటు మరో ఐదుగురు వ్యాపారులు బుధవారం కరీం బాషాపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

ఆరా పేరుతో టోకరా!

- వీడియోలు చూడండి.. డబ్బులు సంపాదించండి
- నిరుద్యోగులు, మధ్యతరగతి ప్రజలే లక్ష్యంగా లక్షలు వసూళ్లు
- మదనపల్లె పరిసర ప్రాంతాల్లో 6 వేలకు పైగా బాధితులు
- న్యాయం చేయాలంటూ తాలూకా పోలీస్ స్టేషన్‌కు పరుగులు
- సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేసిన బాధితులు


తాలూకా పోలీస్ స్టేషన్ ఎదుట జరిగిన మోసాన్ని వివరిస్తున్న బాధితులు

మదనపల్లె రూరల్ : ఆరా యాప్.. కేవలం రూ.2వేలు చెల్లించండి. ప్రతిరోజు వాట్సాప్ గ్రూప్‌నకు మేము పంపే 5 వీడియోలు చూస్తే చాలు.. మీ ఖాతాలో వేలకు వేలు డబ్బులు జమ అవుతాయంటూ పేద, మధ్య తరగతి ప్రజలతో పాటు నిరుద్యోగులను లక్ష్యంగా చేసుకుని, భారీ స్థాయిలో ఆన్‌లైన్ మోసానికి పాల్పడిన వైనం బుధవారం మదనపల్లెలో వెలుగు చూసింది. బ్యాంకు ఖాతాలకు నగదు జమ కాకపోవడంతో తాము మోసపోయామని గ్రహించిన బాధితులు తాలూకా పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకుని మీడియాతో తమ గోడును వినిపించారు. ఆరా బురిడీ కొట్టించిన వైనంపై సైబర్ క్రైమ్ సెల్‌కు స్థానికుడైన వి. రాజ్‌కుమార్ ఫిర్యాదు చేశారు. మదనపల్లె పట్టణం ఎగువ కురవంకకు చెందిన మోహన్‌బాబు.. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించి ఆరా యాప్ నిర్వాహకుడిగా వ్యవహరిస్తున్నాడు. ఆరా యాప్‌లో.. రూ.2వేలు డిపాజిట్ చెల్లించి సభ్యులుగా చేరితే.. సభ్యులను గ్రూపులుగా విభజించి, ఒక్కో గ్రూపునకు ఒక్కో వాట్సప్ గ్రూప్ క్రియేట్ చేస్తారు. అందులో ప్రతిరోజు 5 వీడియోలను వాట్సప్ లింక్ ద్వారా పంపుతారు. వాటిని వీక్షిస్తే..ఒక్కో వీడియోకు రూ.65 చొప్పున నగదు నేరుగా సభ్యుడి బ్యాంకు వ్యక్తిగత ఖాతాకు ఆన్‌లైన్‌లో జమచేస్తామని చెబుతారు. ఇలా మొదట్లో చేరిన సభ్యులకు...ఠంచనుగా డబ్బులు ఖాతాలకు జమచేస్తూ వచ్చాడు. అంతేకాకుండా ఈ యాప్‌లోని స్పిన్ వీల్‌లో మీ అదృష్టాన్ని పరీక్షించుకుంటే, అందులో గెలిచిన బహుమతులను సైతం ఇస్తామని ప్రకటించారు. మొదట్లో గెలిచిన కొద్దిమందికి ఇచ్చారు. బహుమతులు, డబ్బులు జమ అయిన సభ్యులతో తాము ఎలా లాభం పొందిందనే విషయం వారి మాటల్లోనే చెప్పిస్తూ వీడియోలు తీసి విస్తృతంగా ప్రచారం చేశాడు. దీంతో వేలసంఖ్యలో ప్రజలు ఆరా యాప్‌లో సభ్యులుగా చేరారు. సులభంగా డబ్బులు వస్తాయనే దురాశతో మదనపల్లె పరిసర ప్రాంతాల్లో సుమారు 6వేల మందికి పైగా డిపాజిట్లు చెల్లించి సభ్యులుగా చేరారు. ఆరా యాప్ నిర్వాహకులు చెప్పినట్లుగానే వీడియోలు చూశారు. డబ్బులు ఖాతాకు జమచేసినట్లు యాప్‌లో మెసేజ్ వచ్చింది. అయితే డబ్బులను ఖాతా నుంచి తీసుకునేందుకు వెళితే మాత్రం డబ్బులు జమ కాలేదని తెలవడంతో మోసపోయామని గుర్తించారు. కొద్ది రోజులుగా ఆరా యాప్ పేరుతో క్రియేట్ చేసిన వాట్సప్ గ్రూప్ ఇన్‌యాక్టివ్‌లోకి వెళ్లింది. దీంతో బాధితులు తాలూకా పోలీస్ స్టేషన్‌కు చేరుకుని తమకు జరిగిన అన్యాయంపై ఆవేదన వ్యక్తం చేశారు. ఆరా యాప్ సొమ్ముల కోసం నిర్వాహకులకు తెలియజేసిన ఆధార్, వ్యక్తిగత బ్యాంకు ఖాతాల సమాచారంతో భవిష్యత్తులో తమకు ఏదేని ఇబ్బందులు తలెత్తవచ్చనే అనుమానం వ్యక్తం చేశారు. జరిగిన మోసంపై పోలీసుల సలహా మేరకు సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై నిర్వాహకుడైన మోహన్‌బాబును ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నిస్తే.. అందుబాటులోకి రాలేదు.

యువతి ఆత్మహత్య


లక్ష్మీదేవి మృతదేహం వద్ద బంధువులతో మాట్లాడుతున్న ఎస్ఐ

మైలవరం : మండల పరిధిలోని వేపరాల గ్రామానికి చెందిన కుండా లక్ష్మీదేవి(39) అనే మహిళ ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ శ్యాం సుందర్‌రావు ఇచ్చిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కుండా లక్ష్మీదేవికి భర్త తరపున ఆడపడచులతో మనస్పర్థలు వస్తుండటంతో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుందన్నారు. ఆత్మహత్యలతో సమస్యలు పరిష్కారం కావని తమ దృష్టికి తీసుకుని వస్తే కౌన్సెలింగ్ ఇస్తామని తెలిపారు. జీవితాలకు ఇలా అర్ధంతరంగా ముగింపు పలికితే పిల్లల పరిస్థితి ఏమిటో ఒక్కసారి ఆలోచించుకోవాలని సూచించారు.

‘ఆడబిడ్డ నిధి’ ఇవ్వకుండానే రాష్ట్రాన్ని అమ్మేస్తున్నారు

మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా


మీడియాతో మాట్లాడుతున్న మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : ‘ఆడబిడ్డ నిధి’ ఇవ్వాలంటే ఆంధ్రాను అమ్మాయాల్సిందేనని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారని...వాస్తవానికి ఆ పథకం అమలు చేయకుండానే కూటమి నేతలు రాష్ట్రాన్ని అమ్మేస్తున్నారని మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్‌బి అంజద్‌బాషా విమర్శించారు. బుధవారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు ఇచ్చిన హామీలను నీరుగార్చేందుకు మంత్రులతో ఇలా మాట్లాడిస్తున్నారన్నారు. ఎన్నికల ముందు ‘బాబు ష్యూరిటీ, భవిష్యత్‌కు గ్యారెంటీ’ పేరుతో 143 హామీలు ఇచ్చారని, లోకేష్ యువగళంలోనూ అవే హామీలు ఇచ్చారన్నారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ సంతాలు పెట్టిన బాండ్లను ప్రతి గడపకు పంపిణీ చేశారన్నారు. అప్పుడు హామీ ఇచ్చిన అదే నోటితో అమలు చేయలేమంటున్నారన్నారు. రాష్ట్రంలో 18ఏళ్లు నిండిన మహిళలు 1.80కోట్ల మంది ఉన్నారని, వారికి మొదటి ఏడాది రూ.32,500 కోట్లు ఎగ్గొట్టారన్నారు. రెండో ఏడాది 35,100 కోట్లు బకాయి పడ్డారన్నారు. అన్నీ లెక్కలు వేసుకున్నాం... కచ్చితంగా హామీలు అమలు చేసి తీరుతాం...లేనిపక్షంలో కాలర్ పట్టుకొని నిలదీయాలని చెప్పిన చంద్రబాబు, లోకేష్‌లు ఇప్పుడేం చెబుతారని ప్రశ్నించారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లలో రూ.3.33 లక్షల కోట్లు అప్పు చేస్తే, చంద్రబాబు 14 నెలల్లోనే రూ.1.87లక్షల కోట్లు చేశారన్నారు. ‘హరిహర వీరమల్లు’ సినిమా టికెట్ల పెంపుపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యలపై లేదని విమర్శించారు.

అక్రమ వసూళ్లే వారి పరమావధి

కూటమి నేతలకు కింది నుంచి పైదాకా అక్రమ వసూళ్లు చేయడమే పరమావధిగా మారిందని అంజద్‌బాషా విమర్శించారు. మహానాడు పేరు చెప్పి ఎమ్మెల్యే మాధవి, ఆమె భర్త శ్రీనివాసులరెడ్డి అక్రమ వసూళ్లకు పాల్పడ్డారని ఆరోపించారు. తానేం తక్కువ కాదంటూ ఆ పార్టీలోని విద్యార్థి నాయకుడు అన్ని విద్యాసంస్థల నుంచి అక్రమ వసూళ్లు చేశారని ఆరోపించారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పి. జయచంద్రారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి శివప్రసాద్, నార్త్ జోన్ అధ్యక్షుడు బీహెచ్ ఇలియాస్, మైనార్టీ నేతలు షఫీ, జమీల్ పాల్గొన్నారు.

పొలంలో అక్రమ పైపులైన్ వేస్తే ఆత్మహత్య చేసుకుంటాం

అల్లాడుపల్లెలో జేసీబీతో చేస్తున్న పనులు అడ్డుకున్న రైతు దంపతులు


తమ పొలంలో అక్రమంగా పైపులైన్ వేసేందుకు ప్రయత్నిస్తున్నారని వాపోతున్న కుళ్లాయిరెడ్డి

చాపాడు : రెవెన్యూ అధికారులు, పోలీసులను అడ్డుపెట్టుకుని తమ పొలంలో అక్రమంగా పైపులైను ఏర్పాటు చేస్తే ఆత్మహత్య చేసుకుంటామని మండలంలోని అల్లాడుపల్లెకు చెందిన రైతు దంపతులు గోసుల ఎరికలయ్య గారి కుళ్లాయిరెడ్డి, పద్మావతి బుధవారం వాపోయారు. మండలంలోని అల్లాడుపల్లె పొలం సర్వే నెంబరు 90–2లోని కుళ్లాయిరెడ్డి పొలంలో బుధవారం తన తమ్ముడైన సుధాకర్‌రెడ్డి జేసీబీ పెట్టి పైపులైన్ ఏర్పాటు కోసం పనులు చేస్తుండగా కుళ్లాయిరెడ్డి, తన భార్య పద్మావతి, కూతురు రాజేశ్వరి పనులు అడ్డుకున్నారు. ఇక్కడ పనులు చేస్తే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటామని చెప్పారు. దీంతో పనులు ఆపి వెళ్లిపోయారు. బాధితులు మాట్లాడుతూ.. సర్వే నెంబరు 90–2లో 2.50 ఎకరాల సొంత పొలంలో వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. అల్లాడుపల్లెకు చెందిన ఓ టీడీపీ నాయకుడు, వీఆర్వో, ముగ్గురు పోలీసులు సహకారంతో సుధాకర్‌రెడ్డి బుధవారం తమ పొలంలోకి జేసీబీని తీసుకువచ్చి పైపులైను ఏర్పాటు కోసం పనులు చేస్తున్నారన్నారు. గతంలో ఇలా చేయగా అడ్డుకున్నామని మళ్లీ ఇప్పుడు అధికారులను అడ్డుపెట్టుకుని తహసీల్దారు రమాకుమారి తమకు ఆదేశాలు ఇచ్చిందని చెబుతూ తమ పొలంలో అక్రమంగా పైపులైను వేసేందుకు ప్రయత్నించాడన్నారు. మైదుకూరు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ దృష్టికి కూడా సమస్యను తీసుకెళ్లినట్లు తెలిపారు.

తహసీల్దార్ ఏమన్నారంటే..

అల్లాడుపల్లెలోని రైతు కుళ్లాయిరెడ్డి పొలంలో పైపులైన్ నిర్మాణం విషయమై తహసీల్దార్ రమాకుమారిని వివరణ కోరగా.. కుళ్లాయిరెడ్డి పొలంలో పైపులైను వేసుకోవచ్చని తాను ఎవరికీ చెప్పలేదన్నారు. తన వద్దకు ఎలాంటి దరఖాస్తు రాలేదని చెప్పారు.

అస్సాంలో మెడికో ఆత్మహత్య


హేమలత మృతదేహం

జమ్మలమడుగు : ఎర్రగుంట్ల మండలం పోట్లదుర్తి గ్రామానికి చెందిన పడిగేపాటి లక్ష్మిరెడ్డి కుమార్తె పడిగేపాటి హేమలత(25) వత్తిడి తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంది. హేమలత ఇంటర్మీడియట్ నుంచి చదువులో బాగా రాణిస్తుండటంతో మెడిసిన్‌లో ఉచితంగా సీటు దక్కించుకుంది. పీజీలో సైతం ఉచిత సీటు రావడంతో అస్సాంలోని బార్పేట జిల్లా ఫక్రుద్దీన్ ఆలీ అహ్మద్ మెడికల్ కాలేజిలో గైనకాలజీ రెండో సంవత్సరం చదువుతోంది. గైనకాలజీ కోర్సులో భాగంగా హాస్పిటల్స్‌లో వర్కింగ్ విధులు ఎక్కువ సమయాన్ని కేటాయించడం వల్ల మానసిక వత్తిడి తట్టుకోలేక ఇబ్బందికి గురైనట్లు తెలుస్తోంది. దీంతో వైద్యుల వద్దకు వెళ్లి చూపించుని ఆరోగ్యం కుదుటపడటంతో తిరిగి రెండు నెలల క్రితం అస్సాం వెళ్లింది. తిరిగి మానసిక వత్తిడికి గురై ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు పోట్లదుర్తిలో ఉన్న తల్లిదండ్రులకు కాలేజి యాజమాన్యం సమాచారం ఇచ్చింది. తల్లిదండ్రులు అస్సాంకు వెళ్లినట్లు తెలుస్తోంది.

కడప, చిత్తూరు జట్ల ఘన విజయం


ఎస్ఎండి షారుఖ్ అక్తర్ చిత్తూరు (105 పరుగులు)


విష్ణు చైతన్య, నెల్లూరు (4 వికెట్లు)

కడప వైఎస్సార్ సర్కిల్ : ఏసీఏ అండర్–16 మల్టీ డే మ్యాచ్‌లో కడప, చిత్తూరు జట్లు ఘన విజయం సాధించాయి. బుధవారం మూడో రోజు వైఎస్సార్ ఆర్ క్రికెట్ స్టేడియంలో అనంతపురం, చిత్తూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 51 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో మ్యాచ్ ప్రారంభించిన చిత్తూరు జట్టు 74.5 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 197 పరుగులు సాధించింది. ఆ జట్టులోని మహ్మద్ షారుఖ్ అక్తర్ 105 పరుగులు, ఎస్ఎంజి ప్రభాకర్ 37 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని సంజయ్ 3 వికెట్లు, కిరణ్‌కుమార్ 2 వికెట్లు తీశారు. దీంతో చిత్తూరు జట్టు విజయం సాధించింది. కాగా అనంతపురం జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 128 పరుగులు, రెండవ ఇన్నింగ్స్‌లో 252 పరుగులు చేసింది. చిత్తూరు తొలి ఇన్నింగ్స్‌లో 184 పరుగులు, రెండవ ఇన్నింగ్స్‌లో 197 పరుగులు చేసింది.

కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో...

కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో జరిగిన మరో మ్యాచ్‌లో బుధవారం మూడో రోజు 95 పరుగుల ఓవర్ నైట్ స్కోరుతో మ్యాచ్‌ను ప్రారంభించిన కడప జట్టు 66.3 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 155 పరుగులు చేసింది. నెల్లూరు జట్టులోని ఎస్‌వి చైతన్య 4 వికెట్లు, సుశాంత్ 2 వికెట్లు, రిత్విక్ 2 వికెట్లు తీశారు. ఈ మ్యాచ్‌లో నెల్లూరు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 78 పరుగులు, రెండవ ఇన్నింగ్స్‌లో 215 పరుగులు చేసింది. కాగా కడప జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 140 పరుగులు చేయగా రెండవ ఇన్నింగ్స్‌లో 155 పరుగులు చేసింది. దీంతో కడప జట్టు విజయం సాధించింది.

రైలు కింద పడి యువకుడి మృతి


రైలు కిందపడి మృతి చెందిన యువకుడు


అపస్మారక స్థితిలో పడి ఉన్న భక్తవత్సలం

కడప కోటిరెడ్డిసర్కిల్ : చెన్నై నుంచి కడప వరకు టిక్కెట్ తీసుకున్న గుర్తు తెలియని యువకుడు తెల్లవారుజామున ఒంటి గంట ప్రాంతంలో రైలు కింద పడి మృతి చెందాడని తాడిపత్రి రైల్వే హెడ్ కానిస్టేబుల్ వరప్రసాద్ తెలిపారు. ఆయన కథనం మేరకు.. చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్ నుంచి ఓ గుర్తు తెలియని యువకుడు రూ. 115 చెల్లించి టిక్కెట్ తీసుకున్నాడన్నారు. ఈయన కడపలో దిగకుండా తాడిపత్రి–అనంతపురం ఫ్లై ఓవర్ బ్రిడ్జి వద్ద రైలు కిందపడి మృతి చెంది ఉన్నాడన్నారు. మృతికి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అపస్మారక స్థితిలోని వ్యక్తి రిమ్స్‌కు తరలింపు

కడప నగరం ఆర్టీసీ బస్టాండు సమీపంలోని నిర్మానుష్య ప్రాంతంలో భక్తవత్సలంనాయుడు అనే వ్యక్తి అపస్మారక స్థితిలో పడిపోయాడు. ఈ మేరకు పాదచారులు ఇచ్చిన సమాచారం మేరకు కానిస్టేబుల్ మహేష్, ఏఎస్ఐ శ్రీరాములు నాయక్, ఆర్టీసీ కానిస్టేబుల్ గుండ్లకుంట రవి, ఆర్టీసీ రిటైర్డ్ కండక్టర్ గోగు వెంకట సురేష్‌బాబులు గమనించి 108 వాహనం ద్వారా చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. అతని జేబులో ఉన్న ఫోన్ ద్వారా కుమారుడికి సమాచారం అందించామని, ఆయన హైదరాబాదు నుంచి కడపకు వస్తున్నారని తెలిపారు.

ఇనగలూరు దాడి కేసులో ఐదుగురి అరెస్టు

తొండూరు : మండలంలోని ఇనగలూరు గ్రామానికి సంబంధించి సైదాపురం బస్టాప్ సమీపంలో జరిగిన దాడి ఘటన కేసులో ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఘన మద్దిలేటి తెలిపారు. బుధవారం ఇనగలూరు క్రాస్ రోడ్డు వద్ద ప్రశాంత్‌రెడ్డి, ఓబుళరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, గంగిరెడ్డిలను అరెస్టు చేసి రిమాండుకు పంపినట్లు ఆయన తెలిపారు. ఈ ఘర్షణకు సంబంధించిన కేసులో మిగిలిన ఆరుగురిని కూడా త్వరలో పట్టుకుంటామని ఆయన పేర్కొన్నారు.

పోలీసులు కొట్టారని నిందితుల ఆరోపణ

ఇనగలూరు గ్రామంలో జరిగిన దాడి సంఘటనకు సంబంధించిన నిందితులు తమను మూడు రోజుల క్రితం పోలీసులు అదుపులోకి తీసుకుని కొట్టి వేధింపులకు గురి చేశారని జడ్జి ఎదుట వాపోయినట్లు తెలిసింది. దీంతో జడ్జి వైద్య పరీక్షలు నిర్వహించాలని పోలీసులను ఆదేశించారు. ఇరువర్గాల వారు అధికార పార్టీకి చెందినవారే అయినప్పటికీ ఒక వర్గానికి పులివెందుల నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి మద్దతు తెలపడంతోనే పోలీసులు తమను చితకబాదారని బాధితులు పేర్కొంటున్నారు.

పాలక వర్గాలపై పోరాటం


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఈశ్వరయ్య

బద్వేలు అర్బన్ : అపసవ్య విధానాలు అవలంబిస్తున్న పాలక వర్గాలపై పోరాటాలే లక్ష్యంగా ముందుకు సాగాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య పేర్కొన్నారు. సీపీఐ 25వ జిల్లా మహాసభల సందర్భంగా రెండవ రోజైన బుధవారం స్థానిక నెల్లూరు రోడ్డులోని రాఘవేంద్ర గ్రాండ్‌లో నిర్వహించిన ప్రతినిధుల సభలో ఆయన మాట్లాడుతూ వంద సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన కమ్యూనిస్టు పార్టీ ఓట్లు, సీట్లు కొలమానం కాకుండా ప్రజా సమస్యలపై నిరంతరం పోరాటాలు కొనసాగిస్తోందని అన్నారు. తాము అధికారంలోకి వస్తే ప్రజల జీవన స్థితిగతులు మారుస్తామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు చెప్పిన హామీలు ఏమాత్రం అమలు కావడం లేదన్నారు. మోదీ ప్రభుత్వం పేద ప్రజల, రైతుల, కార్మికుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి కేవలం కార్పొరేట్ వర్గాల ప్రయోజనాల కోసం పరితపిస్తోందని ధ్వజమెత్తారు. ప్రశ్నించే గొంతుకలపై ఉగ్రవాదులు, తీవ్రవాదులు, నక్సలైట్లు అనే ముద్ర వేసి ఆపరేషన్ కగార్ పేరుతో కాల్చి చంపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అటవీ ప్రాంతంలోని ఖనిజ సంపద, అటవీ సంపదను కార్పొరేట్ వర్గాలకు దోచిపెట్టేందుకే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటుతున్నా ఇచ్చిన హామీలు అమలు చేయకుండా మంచి ప్రభుత్వం, సుపరిపాలన అంటూ ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో సీపీఐ జాతీయ సమితి సభ్యుడు శివారెడ్డి, జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్, నాగసుబ్బారెడ్డి, వెంకటసుబ్బయ్య, రామయ్య, వెంకటశివ, బాదుల్లా, భాగ్యలక్ష్మి, విజయలక్ష్మి, ఏరియా సహాయ కార్యదర్శి మస్తాన్, పట్టణ, రూరల్ కార్యదర్శులు బాబు, ఇమ్మానియేలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజల దృష్టి మరల్చేందుకే ఎంపీ అక్రమ అరెస్టు

– ఎమ్మెల్యే డాక్టర్ సుధ



బద్వేలు అర్బన్ : టీడీపీ ప్రభుత్వ వైఫల్యాలను, మోసాలను కప్పిపుచ్చుకోవడానికి, వాటి నుంచి ప్రజల దృష్టిని మరలించేందుకే వైఎస్సార్‌సీపీ లోక్‌సభ పక్షనేత, ఎంపీ పి.వి.మిథున్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేశారని బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ పేర్కొన్నారు. బుధవారం ఎన్‌జీఓ కాలనీలోని ఎమ్మెల్యే నివాసంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమాన్ని, ప్రజలకు ఇచ్చిన హామీలను గాలికొదిలేసి ప్రశ్నించే వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. ఇచ్చిన హామీలను అమలు చేయలేక ప్రజల దృష్టిని మరల్చేందుకే చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్‌కు తెర లేపారని, అందులో భాగంగానే ఎంపీ మిథున్‌రెడ్డిని అక్రమ అరెస్టు చేశారని అన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న రెడ్ బుక్ రాజ్యాంగంపై ప్రజలు తిరగబడే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అన్నారు. ఎన్ని కుయుక్తులు పడినా వైఎస్సార్‌సీపీ శ్రేణుల మనోధైర్యాన్ని తగ్గించలేరని, నిత్యం ప్రజల్లో ఉంటూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో ప్రజా సమస్యలపై పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు.


భవన నిర్మాణాలకు పటిష్టమైనది భారతి సిమెంటు


బీమా పత్రాలను అందజేస్తున్న భారతి సిమెంటు ప్రతినిధులు

సిద్దవటం : అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలకు భారతి సిమెంటు పటిష్టమైనదని భారతి సిమెంట్ టెక్నికల్ ఇంజినీర్ ఎస్. శ్రీకాంత్‌రెడ్డి, మార్కెట్ అధికారి రమణారెడ్డి తెలిపారు. సిద్దవటం మండలం మాధవరం–1 గ్రామంలోని మదర్ థెరిస్సా ఎంటర్ ప్రైజెస్ సమీపంలో తాపీ మేస్త్రీలకు సిమెంటు వినియోగంపై బుధవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారతి సిమెంటు రోబోటిక్ టెక్నాలజీతో తయారవుతుందన్నారు. అల్ట్రాఫాస్ట్ నాణ్యత కలిగి ఉంటుందన్నారు. అనంతరం వారు 40 మంది మేస్త్రీలకు లక్ష రూపాయల ఉచిత బీమా బాండ్ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డీలర్ కె. వెంకట్రామిరెడ్డి, మేస్త్రీలు పాల్గొన్నారు.

కారును ఢీ కొన్న లారీ

ఒంటిమిట్ట : మండల పరిధిలోని మంగంపేట వద్ద కడప–చెన్నై జాతీయ రహదారిపై బుధవారం కారును లారీ ఢీ కొన్న ప్రమాదంలో నలుగురికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు రాజంపేటలోని నూనెవారిపల్లికి చెందిన నలుగురు కారులో కడపకు వెళ్తుండగా మంటపంపల్లి వద్ద ఉన్న డాబాల సమీపానికి రాగానే కడప నుండి చెన్నై వెళ్తున్న గ్యాస్ లారీ ఎదురుగా వచ్చి ఢీ కొంది. దీంతో కారులోని తరుణం (17), కిరణ్ (20), రాఘవేంద్ర (20), బాలు (23) అనే నలుగురు యువకులకు రక్త గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన వారిని 108 సహాయంతో కడప రిమ్స్‌కు తరలించారు.


గాయపడిన వారిని రిమ్స్‌కు తరలిస్తున్న దృశ్యం

ప్రక్షాళన దిశగా కడప కేంద్ర కారాగారం

రాయలసీమ జైళ్లశాఖ ఇన్‌చార్జి డీఐజీ ఎం.ఆర్ రవికిరణ్



కడప అర్బన్ : కడప కేంద్ర కారాగారంలో సెల్‌ఫోన్‌లు దొరుకుతున్నాయని, నిబంధలకు విరుద్ధంగా కొందరు అధికారులు, సిబ్బంది ప్రవర్తిస్తున్నారని వస్తున్న ఆరోపణలపై జైళ్ల శాఖ డీజీ అంజనీకుమార్ ఆదేశాల మేరకు ప్రక్షాళన చేసేందుకు తనను విచారణకు పంపించారని జైళ్లశాఖ రాయలసీమ రేంజ్ ఇన్‌చార్జి డీఐజీ ఎం.ఆర్ రవికిరణ్ తెలిపారు. బుధవారం ఆయన తమ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. తమ విచారణలో సెల్‌ఫోన్‌లు బయటనుంచి విసిరేస్తున్నారని తెలుసుకున్నామన్నారు. సెల్‌ఫోన్‌లు దొరికిన ప్రతిసారీ పోలీసులకు ఫిర్యాదు చేసి కేసు నమోదు చేయించి విచారణ చేసి వుంటే బాగుండేదన్నారు. కొన్ని సందర్భాలలోనే ఫిర్యాదులు చేశారని ఇందుకు బాధ్యులైన వారిపై ప్రాథమికంగా విచారణ చేసి నివేదికలను డీఐజీకి పంపించామన్నారు. డీజీ దేశాల మేరకు ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న డిప్యూటీ సూపరింటెండెంట్‌లు, జైలర్స్ ఇద్దరు, ముగ్గురు వార్డర్లను సస్పెండ్ చేశారన్నారు. కారాగార నిబంధనల మేరకు ఖైదీలను బ్యారక్‌లలో వుంచి, సెల్‌ఫోన్‌లు బయట నుంచి రాకుండా వుండేందుకు పకడ్బందీగా చర్యలను చేపడుతున్నామన్నారు. ఇంకా విచారణ కొనసాగుతోందన్నారు.

జగనన్న కాలనీలో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు


మామిళ్లపల్లె పరిధిలోని జగనన్న కాలనీలో వెలసిన అక్రమ నిర్మాణాలు

చింతకొమ్మదిన్నె : మండలంలోని మామిళ్లపల్లె పరిధిలో జగన్‌మోహనరెడ్డి ప్రభుత్వం పేద ప్రజలకు గృహ నిర్మాణానికి లే అవుట్ వేసి స్థలాలు కేటాయించింది. పెద్ద లే–అవుట్ కావడంతో అందులో మిగిలిన ప్లాట్లపై కొందరు అక్రమార్కుల కన్ను పడింది. ఖాళీగా ఉన్న జాగాలలో కొందరు పునాదులు తీసి బేసిమట్టాలు వేసి తమకు తోచిన వారికి తోచిన రేటుకు బోగస్ డి– పట్టాలతో యాథేచ్ఛగా అమ్మకాలు సాగిస్తున్నట్లు మామిళ్లపల్లె వైఎస్సార్ సీపీ నాయకులు తెలిపారు. కొందరు అధికారులు కూడా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై చింతకొమ్మదిన్నె తహసీల్దార్ నాగేశ్వరరావును వివరణ కోర తమ దృష్టికి వచ్చిన వెంటనే మామిళ్లపల్లె గ్రామ రెవెన్యూ అధికారిని పంపి విచారించామన్నారు. డి–పట్టాలు పొందిన వారు కాకుండా ఇతరులు ఇళ్ల నిర్మాణం చేపడితే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.